సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 17 । నవంబర్ । 2024

కొనసా..గుతున్న పిట్‌లైన్

ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో నిర్మిస్తున్న పిట్‌లైన్ పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. గడువు ముగిసి నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి కాని పరిస్థితి.



15లో▸

రేపటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వే, గ్రూప్–3 పరీక్షల నిర్వహణ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లుగా కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
29.0/15.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండగా ఉంటుది. రాత్రివేళలో చలితీవ్రతతో పాటు గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సమగ్ర సర్వే పరిశీలన



ఎన్యుమరేటర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ, వడ్డెర కాలనీల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను కలెక్టర్ రాజర్షి షా శనివారం పరిశీలించారు. ఎన్యుమరేటర్లతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొరపాట్లకు తావివ్వకుండా కుటుంబ సభ్యుల సమాచారం పక్కాగా సేకరించాలని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.

కార్తికమాసం పరమ పవిత్రం



భక్తులకు ఉపదేశిస్తున్న స్వామీజీ

ఆదిలాబాద్: కార్తికమాసం ఎంతో పవిత్రమైందని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామీజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయం (మంగమఠ)లో నిర్వహించిన కాకడ హారతి సమాప్తి, గోపాల కాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక మాసం ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకుడు వైభవ్ శర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న శంకర్

ఎదులాపురం: సీపీఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా సమితి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలన్నారు. పార్టీ ఆవిర్భవించి డిసెంబర్ 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తవుతాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ గ్రామాన ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఇందులో జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు నళినీరెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రంలో పత్తి నిల్వలు

చెల్లింపులూ ఫాస్ట్

- పత్తి రైతులకు గడువులోపు సీసీఐ పేమెంట్
- విక్రయించిన ఎనిమిది రోజుల్లో ఖాతాల్లోకి డబ్బులు
- కొనుగోళ్లలో ప్రైవేటును మించిన ప్రభుత్వ రంగసంస్థ
- కొంత మంది రైతులకు ప్రీమియం ఇన్సెంటీవ్ కూడా..

సాక్షి,ఆదిలాబాద్: పత్తిని విక్రయించిన రైతులకు సీసీఐ చెల్లింపులు నిర్దేశిత గడువులోపు పూర్తవుతున్నాయి. భారత పత్తి సంస్థకు రైతులు పత్తిని అమ్మిన ఎనిమిది రోజుల్లోగా వారి ఖాతాలోకి డబ్బులు చేరుతున్నాయి. ఇటు కొనుగోళ్లు భారీగా పెంచడంతో పాటు పేమెంట్‌లోనూ సీసీఐ దూకుడుగా వెళ్తోంది. ఇదిలా ఉంటే నిర్ధారిత తేమ 8 కంటే తక్కువ శాతం వచ్చిన రైతులకు ప్రీమియం ఇన్సెంటీవ్ కూడా అందజేస్తుంది. జిల్లాలో పలువురు రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకురావడంతో ప్రయోజనం పొందుతున్నారని మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రైవేటును మించి..

జిల్లాలో సీసీఐ 11 కేంద్రాలు ఏర్పాటు చేసి 15 జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని కొనుగోలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా కొనుగోలు ప్రారంభమైన మొదట్లో సీసీఐ పత్తిలో తేమ ఉందనే కారణంగా జిల్లాలో అంతగా దిగుబడులు కొనుగోలు చేయలేదు. తేమ కారణంగా రైతులు ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి అదనపు శాతం తేమకు రూ.75 కోత పెడుతూ ప్రైవేటు వ్యాపారులు రైతుల నడ్డి విరిచారు. అయితే కొద్ది రోజులుగా మాత్రం సీసీఐ కొనుగోళ్లలో దూకుడు పెంచింది. ఈ నెల 15న జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు కేవలం 3,368 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేయగా, సీసీఐ ఏకంగా 22,575 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఇలా రోజు రోజుకు రైతుల దగ్గర నుంచి పత్తిని సీసీఐ భారీగా కొనుగోలు చేస్తుంది.

పత్తి కొనుగోళ్ల వివరాలు (ఈ నెల 15 వరకు)
రైతులు విక్రయించిన పత్తి : 2,73,056 క్వింటాళ్లు
ప్రైవేటుకు విక్రయించిన రైతుల సంఖ్య: 5,594
ప్రైవేటు కొనుగోలు చేసిన పత్తి : 1,08,869 క్వింటాళ్లు
సీసీఐకి విక్రయించిన రైతులు : 6,982
సీసీఐ కొనుగోలు చేసిన పత్తి : 1,64,187 క్వింటాళ్లు

సీసీఐ చెల్లింపుల వివరాలు..
ఈ నెల 14 వరకు కొనుగోలు చేసిన పత్తి విలువ : రూ.105 కోట్లు
ఈ నెల 9 వరకు సీసీఐ చెల్లింపులు : రూ.43 కోట్లు (3,003 మంది రైతులు)

గడువులోపు చెల్లింపులు

సీసీఐకి పత్తిని విక్రయించిన రైతులకు నిర్దేశిత గడువు 8 రోజుల్లోగా వారి వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుంది. ఈ నెల 9 వరకు పత్తిని విక్రయించిన రైతులకు సీసీఐ చెల్లింపులు చేసింది. అంతే కాకుండా నిర్దేశిత తేమ కంటే తక్కువ శాతం ఉంటే ఆ పత్తికి ప్రీమియం ఇన్సెంటీవ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. పలువురు రైతులు ఇప్పటికే ఈ ప్రయోజనం పొందారు. మార్కెట్‌కు వచ్చే రైతులు పత్తిని ఆరబెట్టుకుని తీసుకువచ్చి ప్రయోజనం పొందాలి.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్

తేమ శాతం ఆధారంగా విక్రయం..

సీసీఐ పత్తిలో 8 నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తుంది. మొదట్లో మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ శాతం 13 నుంచి 20 అంత కంటే ఎక్కువ శాతం కూడా రావడం జరిగింది. ఈ పరిస్థితిలో సీసీఐ పత్తిని మొదట్లో కొనుగోలు చేయలేదు. ప్రస్తుతం నిర్ధారిత తేమ శాతంలో వేలాది మంది రైతులు సీసీఐకి పత్తిని విక్రయిస్తున్నారు. పత్తిని ఆరబెట్టుకుని తీసుకుని రావడం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందుతున్నారని మార్కెటింగ్ అధికారులు పేర్కొంటున్నారు. రైతుల్లో ఈ చైతన్యం మరింత పెరిగితే ప్రయోజనం పొందవచ్చని వివరిస్తున్నారు. కాగా 8 శాతం కంటే తక్కువ తేమ పత్తిలో ఉన్న పక్షంలో ప్రీమియం ఇన్సెంటీవ్ కూడా ఇవ్వడం జరుగుతుంది. ఉదాహరణకు ఒక రైతుకు 7 శాతం తేమ పత్తిలో వచ్చిన పక్షంలో అతనికి క్వింటాలుకు మద్దతు ధరకు అదనంగా రూ.75 జోడించి ఇవ్వడం జరుగుతుంది. ఇలా జిల్లాలో వందలాది మంది రైతులు ఈ ఇన్సెంటీవ్ ప్రయోజనం కూడా పొందారు.

వడ్డీ రాయితీ విడుదల

- జిల్లాకు రూ.54.56 లక్షల నిధులు మంజూరు
- 2,058 ఎస్‌హెచ్‌జీలకు ప్రయోజనం
- సభ్యుల ఖాతాల్లోకి రెండు నెలల బకాయిలు

జిల్లాకు మంజూరైన వడ్డీ రాయితీ నిధులు, సంఘాల వివరాలు..

మండలం	గ్రూపులు	విడుదలైన వడ్డీ రాయితీ నిధులు (రూ.లలో)
ఆదిలాబాద్‌రూరల్	114	3,88,470
బజార్‌హత్నూర్	130	3,41,916
బేల	130	3,23,223
భీంపూర్	133	3,62,960
బోథ్	186	6,03,782
గాదిగూడ	110	87,863
గుడిహత్నూర్	97	2,27,342
ఇచ్చోడ	159	3,25,754
ఇంద్రవెల్లి	159	5,18,142
జైనథ్	133	4,35,614
మావల	23	73,374
నార్నూర్	111	2,31,815
నేరడిగొండ	114	2,81,444
సిరికొండ	65	98,056
తలమడుగు	125	4,09,217
తాంసి	84	2,89,956
ఉట్నూర్	185	4,57,505

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తూ ఆ నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ ఏడాది మే నెలలో 2023–24 సంవత్సరానికి సంబంధించి నాలుగు నెలల బకాయిలు విడుదల చేసింది. అయితే కొన్ని సంఘాలకు మాత్రం కేవలం రెండు నెలలవి మాత్రమే జమ అయ్యాయి. వాటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫిబ్రవరి, మార్చి నెలల వడ్డీ రాయితీ నిధులను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. జిల్లాలోని 2,058 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.54.56 లక్షలు విడుదల చేస్తూ సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల విడుదలపై ఆయా సంఘాల సభ్యుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



సమావేశంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

స్వయం ఉపాధికి భరోసా

జిల్లాలోని 17 మండలాల పరిధిలో 7,532 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 1,16,492 మంది సభ్యులున్నారు. వీరు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తుంది. వీటిని సకాలంలో వడ్డీతో సహా చెల్లించిన మహిళా సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీ రాయితీని వారి ఖాతాల్లో జమ చేస్తోంది. అలా వచ్చిన సొమ్ముతో కలిపి బ్యాంకుల్లో ఉన్న రుణాన్ని తగ్గిస్తారు. ఆరు నెలలకోసారి విడుదల చేయాల్సిన వడ్డీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడేళ్లుగా నిలిపివేసింది. దీంతో సకాలంలో రుణాలు చెల్లించిన సభ్యులు వాటి కోసం నిరీక్షించాల్సి వచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పాత బకాయిల జోలికి వెళ్లకుండా ఇక నుంచి రెగ్యులర్‌గా చెల్లిస్తామని ప్రకటించింది. ఈ మేరకు అమలు చేస్తోంది.

రెండు నెలల బకాయిలు విడుదల

గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఉన్న బకాయిలను ఈ ఏడాది మే లో విడుదల చేసింది. అయితే జిల్లాలోని 3,282 సంఘాలకు సంబంధించి రూ.2.82 కోట్ల నిధులను సంబంధిత మహిళల ఖాతాల్లో జమ చేసింది. తాజాగా పెండింగ్‌లో ఉన్న 2,058 సంఘాలకు సంబంధించి ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి రూ.54,56,433లను తాజాగా విడుదల చేసింది.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

కైలాస్‌నగర్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేలా వెంటనే తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఫిల్టర్‌బెడ్‌ను శనివారం ఆయన సందర్శించారు. మరమ్మతులు చేయాల్సిన పైపులైన్లతో పాటు వాల్, సంపును పరిశీలించారు. వాటర్ గ్రిడ్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ గ్రిడ్‌కు సంబంధించి కేఆర్‌కే పైపులైన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇచ్చి కాలనీవాసులకు తాగునీటిని అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్‌లో చేపట్టాల్సిన మరమ్మతులకు రూ.15లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈలు తిరుపతి, కార్తీక్, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.



సంపును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఎల్‌పీజీ అక్రమాలకు చెక్

ఆదిలాబాద్ పట్టణం భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రమేశ్ అనే వ్యక్తికి ఎల్‌పీజీ కనెక్షన్ లేదు. గ్యాస్ కనెక్షన్ కలిగిన మరో వ్యక్తి పేరిట బుకింగ్ చేసుకుని సిలిండర్ తీసుకునేవాడు. అయితే ఆయిల్ కంపెనీలు తాజాగా తెచ్చిన కొత్త నిబంధనతో ఇకపై ఇలా సిలిండర్ పొందడం సాధ్యం కాదు.

- ఓటీపీ ఆధారంగానే సబ్సిడీ గ్యాస్
- అమల్లోకి కొత్త నిబంధన
- అర్హులకే సిలిండర్ అందేలా చర్యలు

జిల్లాలో వంట గ్యాస్ కనెక్షన్ల వివరాలు
సింగిల్ : 1,01,462
డబుల్ : 37,623
ఉజ్వల : 36,098
దీపం : 40,701
మొత్తం ఏజెన్సీలు : 17





సిలిండర్ డోర్ డెలివరీ చేస్తున్న బాయ్

కైలాస్‌నగర్: వంటగ్యాస్ సరఫరాలో అక్రమాలకు చెక్ పెట్టేదిశగా ఆయిల్ కంపెనీలు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చాయి. వినియోగదారులు ఎల్‌పీజీ సిలిండర్‌ను తీసుకోవాలంటే తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా బుకింగ్ చేసిన కస్టమర్ సెల్‌కు సిలిండర్ ధరతో కూడిన క్యాష్ మెమోతో పాటు నాలుగు అంకెలతో కూడిన ఓటీపీ వస్తుంది. వినియోగదారులు ఏజెన్సీ వద్దకు వెళ్లినా, డెలివరీ బాయ్స్ ఇంటి వద్దకు వచ్చి సిలిండర్ అందించాలన్నా ఈ నంబర్ తప్పనిసరి. తద్వారా అర్హులైన వారికే సిలిండర్ అందే అవకాశముంది.

అక్రమాలకు చెక్

ఎల్‌పీజీ కనెక్షన్ లేకున్నా, పరిమితికి మించి వినియోగించే వారు.. తక్కువ గ్యాస్ వాడకం ఉన్న వారి పేరిట బుక్ చేసుకుని సిలిండర్ తీసుకునే వారు. అలాగే డెలివరీ బాయ్స్ సైతం తక్కువగా వినియోగమున్న వారి పేరిట సిలిండర్లను ఇతరులకు అందించేవారు. దీంతో సబ్సిడీ గ్యాస్ పక్కదారి పడతున్నట్లుగా గుర్తించారు. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు, టీకొట్టుల్లోనూ ఇటీవల వంట గ్యాస్ సిలిండర్ల వినియోగం పెరిగి సబ్సిడీ గ్యాస్ దుర్వినియోగమవుతున్నట్లుగా ఆయిల్ కంపెనీలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో కొత్త నిబంధనను ఈ నెల 10నుంచి అమల్లోకి తెచ్చాయి. తద్వారా అర్హులకే సిలిండర్లు అందనున్నాయి.

ఓటీపీ చెబితేనే..

ఆయిల్ కంపెనీలు జిల్లాలో ఓటీపీ నిబంధనను అమలు చేస్తున్నాయి. వినియోగదారులు ఓటీపీ చెబితేనే డెలివరీ బాయ్స్ సిలిండర్ అందజేస్తున్నారు. అయితే గ్యాస్ కనెక్షన్‌కు ఏ మొబైల్ నంబర్‌ను లింక్ చేశారో దాంతోనే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ నంబర్ మార్చినట్‌లైతే సంబంధిత ఏజెన్సీని సంప్రదించి పది నిమిషాల్లో కొత్త నంబర్ నమోదు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

దుర్వినియోగానికి అడ్డుకట్ట

ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరాలో అక్రమాలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతోనే ఆయిల్ కంపెనీలు ఓటీపీ నిబంధనను కొత్తగా అమల్లోకి తెచ్చాయి. ఈనెల 10నుంచి జిల్లాలో అమలు చేస్తున్నాం. దీంతో నిజమైన వినియోగదారులకు మాత్రమే సిలిండర్ అందే అవకాశముంది.

– వాజీద్ అలీ, డీఎస్‌వో

గ్రూప్–3 పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 29 కేంద్రాలు
- హాజరుకానున్న 10,255 మంది అభ్యర్థులు
- గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతి

కైలాస్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షలకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 10,255 మంది అభ్యర్థులు హాజరుకానుండగా వీరి కోసం మావల మండల కేంద్రంతో పాటు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 29 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 17న పరీక్ష రెండు సెషన్లలో కొనసాగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 నిర్వహించనున్నారు. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–3 ఉంటుంది. అభ్యర్థులను పరీక్షకు గంట ముందుగానే కేంద్రాలోకి అనుమతిస్తారు. అరగంట ముందుగా గేట్లను మూసివేస్తారు. ఆలస్యంగా వచ్చిన వారిని లోనికి అనుమతించరు. ఆయా పరీక్ష కేంద్రాలను ఐదు రూట్లుగా నిర్ణయించిన అధికారులు ఐదుగురిని రూట్ అధికారులుగా, మరో ఐదుగురిని జాయింట్ రూట్‌ఆఫీసర్లుగా నియమించారు. 29 మందిని ఇన్విజిలేటర్లుగా, 10 లైవ్‌స్క్వాడ్‌ను కేటాయించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. సెంటర్ల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీచేసిన ఒరిజినల్ ఫొటోతో కూడిన ఐడీ కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉద్యోగులు

పకడ్బందీగా బందోబస్తు ..

ఆదిలాబాద్‌టౌన్: గ్రూప్–3 పరీక్షలకు పకడ్బందీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శనివారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పరీక్షల నిర్వహణపై సిబ్బందికి మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌లో సూచించిన నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఐదు రూట్లలో సీఐ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటూ, ఎస్సై స్థాయి అధికారి ద్వారా నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు. పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా అభ్యర్థులు డయల్ -100 ద్వారా పోలీసు యంత్రాంగం సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, గ్రూప్–3 నోడల్ అధికారి జగ్‌రాం అంతర్వేదీ, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్. జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్: గ్రూప్ 3 పరీక్షల నేపథ్యంలో నేడు, రేపు ఆదిలాబాద్‌నుంచి బంగారిగూడ, జైనథ్ మండలం పిప్పరవాడకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు, తిరిగి సాయంత్రం 5.30 గంటలకు ఈ రూట్లలో ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. అలాగే సోమవారం ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు. ఈ సౌకర్యాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాసరలో మంత్రి 'పొంగులేటి' పూజలు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వేద పండితులు మంత్రికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకుడు సంజీవ్, ఈవో విజయరామారావు మంత్రిని సన్మానించి అమ్మవారి చిత్రపటం అందజేశారు. వైదికబృందం అమ్మవారి ఆలయ ప్రత్యేకతను వివరించింది.



మంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తూ..

ప్రజాపాలన కళాయాత్రను విజయవంతం చేయాలి

కైలాస్‌నగర్: ఈ నెల 19 నుంచి డిసెంబర్ 7వరకు ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల కళాయాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. తన చాంబర్‌లో కార్యక్రమ నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా ఈ నెల 19నుంచి కళాయాత్ర చేపట్టనుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, అంతడుపుల నాగరాజు కళాయాత్ర బృందం ఈ నెల 22న జిల్లాలో ప్రచారం చేయనుందన్నారు. జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులను రెండు టీములుగా ఏర్పాటు చేసి మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఆరు గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో సాయన్న, డీపీఆర్వో తిరుమల, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీపీవో శ్రీలత, మెప్మా పీడీ మమత పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పెద్ద భీమయ్య మృతదేహం

దండేపల్లి: మండలంలోని రాజుగూడ జీపీ పరిధిలోని కుంటలగూడ కట్టకు చెందిన రైతు మార్నేని పెద్ద భీమయ్య (49) సోలార్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం ..పెద్ద భీమయ్య శనివారం తెల్లవా రుజాము తాను కౌలుకు చేస్తున్న పొలానికి నీళ్ల పెట్టేందుకు వెళ్లాడు. ఉదయం 7 గంటలు దాటిన ఇంటికి రాకపోవడంతో భార్య సత్తవ్వ అక్కడికి వెళ్లింది. సోలార్ వైరు వద్ద విద్యుత్ షాక్ తగిలి కాలిన గాయాలతో భీమయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తిర్యాణి: బైక్ అదుపుతప్పి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై మాధవ్ కథనం ప్రకారం..మండలంలోని మోర్రిగూడ గ్రామానికి చెందిన తిరుమల్‌రావు(42) శుక్రవారం రాత్రి పాత సమ్మక్క గద్దల వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య సీతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్డి కట్టేమిషన్‌లో చేతులు ఇరుక్కుని గాయాలు

లోకేశ్వరం: గడ్డి కట్టేమిషన్‌లో రెండు చేతులు ఇరుక్కుని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాజేష్‌తండాకు చెందిన రైతు రాథోడ్ మిథున్ శనివారం తన పొలంలో గడ్డికట్టలు కట్టేందు మిషన్‌ను తీసుకెళ్లాడు. గడ్డి కట్టలు కట్టేక్రమంలో దానికి అమర్చిన దారం తెగిపోయింది. సరిచేసే క్రమంలో మిథున్ చేతులు మిషన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి తాగిన వ్యక్తి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేవాపూర్‌కు చెందిన లొండే సందీప్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. ఈక్రమంలో సందీప్ మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. శనివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు సందీప్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తల్లి దయబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

బాసరలో ఉద్రిక్తత

- ట్రిపుల్‌ఐటీ ముట్టడికి ఏబీవీపీ పిలుపు
- భారీగా మోహరించిన జిల్లా పోలీసులు
- రైల్వేస్టేషన్, ఆలయంలో అరెస్టులు
- ట్రిపుల్‌ఐటీ గోడ దూకిన నాయకులు
- ఏఎస్పీ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు


రైల్వేస్టేషన్ వద్ద పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

భైంసా: బాసరలో శనివారం ఉదయం నుంచే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏబీవీపీ నాయకులు ట్రిపుల్‌ఐటీని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు. ఇటీవల ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని పూరి స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనపై అక్కడికి వెళ్లిన నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడిచేశారు. ఇందులో సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడికి నిరసనగా ఏబీవీపీ నాయకులు ఇప్పటికే జిల్లాలో ఒకరోజు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. తాజాగా ట్రిపుల్‌ఐటీ ముట్టడికి నిర్ణయించారు. హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి నాయకులు వస్తున్నారన్న సమాచారం ఇంటలిజెన్స్ అధికారులు చేరవేశారు. అప్రమత్తమైన ఎస్పీ జానకీషర్మిల..పోలీసులను మోహరించేలా చర్యలు తీసుకున్నారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

వేకువజాము అరెస్టులు

బాసర రైల్వేస్టేషన్‌లో ఉదయం 4 గంటల సమయంలో తాండూరు రైలుకు 50 మందికిపైగా ఏబీవీపీ నాయకులు దిగారు. స్టేషన్‌లో పోలీసు సిబ్బంది వారిని అదుపులో తీసుకున్నారు. ఏబీవీపీ చలో బాసర ట్రిపుల్‌ఐటీ ముట్టడికి తరలివచ్చే వారిని అదుపులో తీసుకునేందుకు ముందుగా ఆటోలను సిద్ధంగా ఉంచారు. వేకువజామున అరెస్టుల పరంపర కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్లే రైళ్లలో బాసర స్టేషన్‌లో దిగిన వారిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానం ఉన్న నాయకులను, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తాము వేరే పనిమీద వచ్చామని చెప్పినా వినిపించుకోలేదు. స్టేషన్‌లో ఏమి జరుగుతుందో విషయం తెలియక యాత్రికులు కొంత అయోమయానికి గురయ్యారు. తాండూరు, సంబల్‌పూర్, నాందేడ్ ప్యాసింజర్ రైళ్లలో దిగిన యాత్రికులను తనిఖీలు చేశారు. కొందరు విద్యార్థులు బాసర ఆలయంలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడికి వెళ్లిన పోలీసులు వారిని లాక్కెళ్లి స్టేషన్‌కు తరలించారు. బాసర అంతటా పోలీసులు మోహరించడంతో ఏమి జరుగుతుందోనని అంతా హైరానా పడ్డారు.

భారీ భద్రత..

బాసర ట్రిపుల్‌ఐటీలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఐడీకార్డులు ఉన్న విద్యార్థులనే లోనికి పంపించారు. అనుమానం ఉన్న ఏబీవీపీ నాయకులను, విద్యార్థులను అదుపులో తీసుకున్నారు. భైంసా, ముథోల్, కుంటాల, నిర్మల్, పెంబి, బాసర పోలీస్ స్టేషన్లకు విద్యార్థులను తరలించారు. బాసర క్యాంపస్‌లోకి కొత్తవారిని అనుమతించలేదు. ఎక్కడ యువకులు కనిపించిన పోలీసులు అక్కడికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల.. ఎప్పటికప్పుడు భద్రతపై ఆరా తీశారు.

గోడ దూకి..

మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ గోడ దూకి లోనికి వెళ్లారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వచ్చేవారిని ముథోల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.


ఏబీవీపీ నాయకులను అదుపులో తీసుకుంటున్న పోలీసులు


రైల్వేస్టేషన్‌లో పోలీసులు


బాసరలో ఏబీవీపీ నాయకులను లాకెళ్తున్న పోలీసులు

పార్లమెంట్ హౌస్‌లో కళాకారుల ప్రదర్శన


రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌తో ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌కు చెందిన సకల కళా సంక్షేమ సంఘం ఆదివాసీ కళాకారులు శుక్రవారం రాత్రి ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రదర్శన చేశారు. గుస్సాడీ, డెంసా తదితర నృత్యాలు ప్రదర్శించారు. బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలు కళాకారులను అభినందించారని సకల కళా సంక్షేమ డైరెక్టర్ కాత్లె శ్రీధర్ తెలిపారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనం పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఎంసీసీ కంపెనీకి చెందిన స్క్రాప్‌ను దొంగిలించి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎంసీసీ కంపెనీకి చెందిన ఇనుపసామగ్రి(స్క్రాప్)ను దొంగిలించి బొలెరో వాహనంలో ర్యాలీ ఘడ్‌పూర్ వైపు తరలిస్తున్నారు. కంపెనీకి చెందిన పెట్రోలింగ్‌లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది శనివారం ఉదయం ఆపే ప్రయత్నం చేశారు. స్క్రాప్ దొంగలు కొంత దూరం వెళ్లాక వాహనాన్ని వదిలేసి పారిపోయారు. వాహనంలో క్వింటాల్ ఇనుప సామగ్రిని గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మూగజీవాల వేటగాళ్లపై చర్యలు

- ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు

మందమర్రిరూరల్: మూగజీవాల వేటగాళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని సారంగపల్లి పంచాయతీ శివారు గల దుబ్బపల్లి అటవీప్రాంతంలో రెండు గేదెలు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలైన విషయం తెలుసుకుని శనివారం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వేటగాళ్లు మూగజీవాల కోసం సుమారు 600 మీటర్ల విద్యుత్ తీగలు అమర్చారని తెలిపారు. అనుమానం ఉన్న సండ్రోన్‌పల్లికి చెందిన ఐదుగురిని గుర్తించామన్నారు. వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయగా ఒకరిని అదుపులో తీసుకున్నామని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్, ఎఫ్‌బీవో రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అటవీ ప్రాంతమంతా గాలింపు

చెన్నాపూర్ శివారులో పులి సంచరిస్తుందనే పుకారుతో శనివారం సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతమంతా గాలించినట్లు ఎఫ్ఆర్వో రత్నాకర్‌రావు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన పత్తి సేకరించడానికి వచ్చిన కూలీలకు ఏదో జంతువు కనబడితే దానినే పులిగా చెప్పుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు అటవీప్రాంతంలోకి వెళ్లొద్దన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే సమూహంతో వెళ్లాలని ఏదైనా పులి తిరిగినట్లు పాదముద్రలు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గడ్డి వ్యాన్ దగ్ధం


దగ్ధమవుతున్న వ్యాన్

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి సమీపంలో గడ్డి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనకల్‌కు చెందిన డ్రైవర్ దుర్గం రవి శనివారం కవ్వాల్ నుంచి గడ్డి కొనుగోలు చేసుకుని వ్యాన్ లోడ్‌తో ఆదిలాబాద్ గోశాలకు వెళ్తున్నాడు. కామన్‌పల్లి నుంచి ప్రధాన కెనల్ మీదుగా కొంత దూరం వెళ్లగా 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు మధ్యలో ఉన్నాయి. కర్రతో పైకి లేపే క్రమంలో రెండు వైర్లు తగిలి గడ్డికి మంటలు అంటుకున్నాయి. గడ్డితోపాటు వ్యాన్ దగ్ధమైంది. స్థానికులు గమనించి ఫైర్ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు బాగాలేకపోవడంతో అగ్నిమాపక వాహనం దూరంగా ఆపాల్సి వచ్చిందని ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44కు అనుకుని ఉన్న ఓ దాబా హోటల్ సమీపంలో 8.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై సునీత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..శుక్రవారం జాతీయ రహదారి 44పై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు రెండు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం తరలిస్తున్న నలుగురి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, రెండు ఆటోలు, బియ్యాన్ని స్వాధీనంచేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిమ్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

తాంసి: రిమ్స్ ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు అందించే వైద్యసేవలను పొన్నారి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లో నూతనంగా చేరిన మెడికోల ఆధ్వర్యంలో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కార్యక్రమాన్ని డైరెక్టర్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ విద్యావిల్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతీ ఐదు కుటుంబాలకు ఒక వైద్యుడిని నియమించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సేవలు ఐదేళ్ల పాటు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఇందులో మాజీసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రేఖ, వైద్యాధికారి శ్రావ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు


క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8 జిల్లాల నుంచి 8 జట్లు, 280 మంది క్రీడాకారులు, 16 మంది కోచ్‌లు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, సమత ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తా చాటి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భోజన్న, అన్నపూర్ణ, జమున, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

కొడుకుపై కత్తితో తండ్రి దాడి

- మద్యంమత్తులో ఘర్షణ
- రిమ్స్ ఆస్పత్రికి తరలింపు


రిమ్స్‌లో వైద్యం పొందుతున్న మెస్రం బాలాజీ

నార్నూర్: మద్యంమత్తులో తండ్రికొడుకులు ఘర్షణ పడ్డారు. ఆవేశానికి లోనైన తండ్రి కత్తితో కొడుకుపై దాడి చేశాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మెస్రం భుజంగ్‌రావు, ఆయన కుమారుడు మెస్రం బాలాజీ వ్యవసాయం చేస్తుంటారు. తాగిన మైకంలో ప్రతీరోజు గొడవ పడుతుండేవారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత మద్యంమత్తులో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో భుజంగ్‌రావు కత్తితో బాలాజీని కడుపులో పొడిచాడు. తీవ్ర గాయం కావడంతో అతడిని కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ రహీంపాషాను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. కాగా, ఏ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందనే వివరాలు తెలియరాలేదు.

వృద్ధాశ్రమానికి తరలింపు

సాక్షి ఎఫెక్ట్..


వృద్ధుడిని తరలిస్తున్న ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మందమర్రిరూరల్: 'అందరూ ఉన్నా..అనాథలా'శీర్షికన ఈనెల 13న సాక్షిలో ప్రచురితమైన కథనానికి శనివారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు స్పందించారు. పట్టణానికి చెందిన వృద్ధుడు తిరుపతిరెడ్డి వద్దకు వెళ్లి వివరాలు సేకరించి మంచిర్యాలలోని వృద్ధాశ్రమానికి తరలించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి అతన్ని వృద్ధాశ్రమానికి తరలించామని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజీమొద్దీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పట్టణ అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, జావీద్‌నపాషా, దిలీప్, చందు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..ముక్కెర రాజేశ్వర్ గౌడ్ నివాసంలోని పై పోర్షన్‌లో తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.10 వేల నగదు, ఐదు మద్యం బాటిళ్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదే కాలనీలోని కమటం రవీందర్, కొల్లూరి రాజు, రాపెల్లి రవి, ఆర్ విజయలక్ష్మి ఇళ్లల్లో చోరీకి యత్నించారు. సమాచారం అందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని సీసీ పుటేజీలను పరిశీలించారు. క్లూస్‌టీంలతో కలిసి విచారణ చేపట్టారు. రాజేశ్వర్‌గౌడ్ ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా సెల్‌ఫోన్ చోరీ

భైంసాటౌన్: ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన పట్టణంలో జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా చేస్తున్న రాంచందర్ శనివారం సాయంత్రం భైంసా-నిర్మల్ మార్గంలో ఖద్ర హోటల్ ప్రాంతంలో వాకింగ్ చేస్తూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగుడు ఫోన్ లాక్కుని పారిపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

వరికోతకు వేళాయె..!

- సన్నద్ధమవుతున్న రైతులు
- వారంలో జోరందుకునే అవకాశం


కోతకు వచ్చిన వరిపంట

బెల్లంపల్లి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరిపంట కోతకు సిద్ధమైంది. ప్రస్తుతం అక్కడక్కడ కోతలు ప్రారంభం కాగా, మరో వారంలో జోరందుకోనున్నాయి. ఇందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 7 మండలాలు, రెండు వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 60 వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంట సాగైనట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. సీజన్ ప్రారంభంతోనే ఇతర ప్రాంతాల నుంచి హార్వెస్టర్లను లీజుకు తీసుకువచ్చి వరి కోతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పత్తితీతకు వెళ్తున్న కూలీలు

వరి కోతలు రాకముందే కూలీలు గ్రామాల్లో పత్తితీత పనులకు వెళ్తున్నారు. కిలో చొప్పున లెక్కకట్టి కూలీ చెల్లిస్తుండటంతో అక్కడికి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. వరి కోత పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఐదారేళ్ల నుంచి రైతులు హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా లీజుకు తీసుకువచ్చిన రైతులు హార్వెస్టర్ల అద్దె ధరకు ఏటా రూ.వందల్లో పెంచుతున్నారు. అద్దె ధర అధికమైనప్పటికీ హార్వెస్టర్లతో వరికోత పనులు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం వీటి పనులు మొదలు కానుండటంతో గ్రామాల్లో సందడి నెలకొననుంది.

కూలీలు రావడం లేదు

వరి కోతలకు ఏటా కూలీల సమస్య ఏర్పడుతోంది. గ్రామాల్లో పత్తి తీత పనులు సాగుతున్నాయి. వరికోత పనులకు కూలీలకు రావడం లేదు. హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తుంది.

– గోమాస మల్లయ్య, రైతు, బెల్లంపల్లి మండలం